క్లుప్తంగా

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

ఒంగోలు సెంట్రల్: గ్రామీణాభివృద్ధి, స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (రూట్ సెట్) ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మార్చి 15 నుంచి ఏప్రిల్ 16వ తేదీ వరకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి పూర్తి ఉచితమని తెలిపారు. జిల్లాకు చెందిన స్త్రీలు 19 నుంచి 45 మధ్య వయస్సు గల వారు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 95733 63141 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

జిల్లాపరిషత్ హైస్కూలు గ్రంథాలయానికి పుస్తకాలు



గ్రంథాలయ పుస్తకాలు అందించిన దాతలు

చీమకుర్తి: సంతనూతలపాడు జిల్లాపరిషత్ హైస్కూలు గ్రంథాలయానికి పీజీఎస్ఎఫ్ సంస్థ నిర్వాహకులు విలువైన 950 గ్రంథాలయ పుస్తకాలను సోమవారం అందించారు. విద్యార్థులలో విజ్ఞానాన్ని పెంపొందించడంలో విలువైన గ్రంథాలు తోడ్పడతాయని పీజీఎస్ఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ కొర్రపాటి సుధాకర్ ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనను, హైస్కూలు హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయుడు డాక్టర్ సుధాకర్‌ను సత్కరించి అభినందించారు.

ముగిసిన సాయి ధ్యాన మందిర వార్షికోత్సవం



గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: ఒంగోలు సాయిబాబా సెంట్రల్ స్కూల్ ప్రాంగణంలో సాయినాథుని ధ్యాన మందిర వార్షికోత్సవం ఆదివారంతో ముగిసింది. సాయిపథం షిరిడీ వారి ఆధ్వర్యంలో శనివారం నుంచి ఆదివారం వరకు వేడుకలు నిర్వహించారు. ఒంగోలు చుట్టుపక్కల గ్రామాల నుంచి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు విశేషంగా తరలివచ్చి ఉత్సవాల్లో పాల్గొన్నారు. సాయినామము పారాయణతో పాటు పూజ్య గురుదేవుడు సాయినాథుని శరత్ బాబూజీ సత్సంగ భాషణలు వీడియో మాధ్యమాల వీక్షించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సాయిబాబా సెంట్రల్ స్కూల్ యాజమాన్యం పర్యవేక్షణలో బాబా గురుదేవుల చిత్రపటాలతో పెళ్లూరులో గ్రామోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.

ఎన్నికల బాండ్ల వివరాలు ప్రకటించాలని సీపీఎం నిరసన



నిరసన తెలియజేస్తున్న సీపీఎం ప్రతినిధులు

ఒంగోలు సెంట్రల్: ఎన్నికల బాండ్ల వివరాలు ప్రకటించాలని సీపీఐ (ఎం) ఆధ్వర్యంలో సోమవారం ఎస్‌బీఐ బ్రాంచ్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. 2019 నుంచి కొనుగోలు చేసిన ఎన్నికల బాండ్ల వివరాలను తప్పనిసరిగా బహిర్గతం చెయ్యాలని, సుప్రీం కోర్టు ఆదేశాలను తక్షణమే అమలు చెయ్యాలని వక్తలు కోరారు. ప్రజలందరూ మతోన్మాద, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న బీజేపీ, దాని మిత్రపక్షాలను చిత్తుగా ఓడించాలని నినాదాలు చేసారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, జిల్లా కార్యవర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనే వైఎస్సార్ సీపీ లక్ష్యం

- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- యరజర్ల గ్రామంలో రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాల ప్రారంభం



మహిళలకు చేయూత చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు రూరల్: సంక్షేమ పాలనే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. అందులో భాగంగానే సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి లక్షా నలభై వేల మందికి ఉద్యోగాలిచ్చి అందరినీ పర్మినెంట్ చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ఒంగోలు మండలంలోని యరజర్ల గ్రామంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను సోమవారం రాత్రి ఆయన ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్ చేయూత సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే బాలినేని మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనటువంటి సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి గ్రామ స్థాయిలోనే ప్రజలకు అన్ని రకాల సేవలు అందుబాటులోకి తెచ్చారన్నారు. గతంలో ఏ చిన్న ధ్రువీకరణ పత్రం కావాలన్నా.. రోజుల తరబడి మండల కేంద్రంలోని కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని గుర్తుచేశారు. అలాంటి పరిస్థితులను రూపుమాపి నేరుగా గ్రామ సచివాలయాల్లోనే ధ్రువీకరణ పత్రాలు పొందే అవకాశం సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు దక్కిందన్నారు. అలాగే, గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యసేవలు అందని ద్రాక్షగా ఉన్న సమయంలో గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, పురుగుమందులు, విత్తనాలను రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చి వ్యవసాయం దండగ కాదు, పండుగని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించారన్నారు. తీరప్రాంతాల్లో ఓడరేవుల నిర్మాణం, రాష్ట్రంలో విమానాశ్రయాల ఆధునికీకరణ జరుగుతోందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు టి.శ్రీనివాసులు, మాజీ వైస్ ఎంపీపీ జె.శ్రీనివాసు, పొగాకు ఉత్పత్తిదారుల చైర్మన్ బసివిరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



రైతు భరోసా కేంద్రం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

సచివాలయ కాంప్లెక్స్ ప్రారంభం



దేవరపాలెంలో సచివాలయం కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: దేవరపాలెం గ్రామంలోని సచివాలయం కాంప్లెక్స్‌ను జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ సోమవారం ప్రారంభించారు. రూ.40 లక్షలతో సచివాలయం, రూ.21.8 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.20.8 లక్షలతో ఆరోగ్య భవనం, రూ.17.67 లక్షలతో బల్క్‌మిల్క్ సెంటర్, మండల పరిషత్ నిధులు రూ.25 లక్షలతో సచివాలయం కాంప్లెక్స్‌కు ప్రహరీ, సైడు డ్రైన్, ఆర్చి నిర్మాణాలను ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. వాటిని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ దేశంలోనే ఆదర్శవంతమైనదిగా కొనియాడారు. దాని ద్వారా స్థానిక గ్రామస్తులకు సేవలందించడం సులభతరమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు చిన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పులి వెంకటరెడ్డి, గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, బూచేపల్లి నాగిరెడ్డి, దాసరి లక్ష్మీనారాయణ, స్థానికులు పాల్గొన్నారు.

ఇంటింటా ఆప్యాయతల వెల్లువ



మహిళలతో మాట్లాడుతున్న బాలినేని శచీదేవి

- 43వ డివిజన్‌లో మహిళలతో మమేకం
- స్త్రీశక్తితో శచీదేవి కార్యక్రమం

ఒంగోలు: మహిళలతో మమేకం–స్త్రీశక్తితో శచీదేవి కార్యక్రమంలో ఇంటింటా ఆప్యాయతలు వెల్లువెత్తుతున్నాయి. ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి బాలినేని శచీదేవి చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా శచీదేవి, వారి కోడలు శ్రీకావ్య, శ్రీకావ్య వదిన కుండా నిఖిత సోమవారం నగరంలోని 43వ డివిజన్‌లోని బ్రాహ్మణ బజార్‌లో ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలడిగి తెలుసుకున్నారు. రాబోయే ఎన్నికల్లో చివరిసారిగా పోటీచేస్తున్న వాసన్నను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎవరైనా సమస్యను వారి వద్ద ప్రస్తావిస్తే ఆ సమస్య మూలాన్ని కూడా అడిగి తెలుసుకోవడంతో పాటు వాటిని రికార్డు చేసుకుంటూ తాము పర్యవేక్షణ చేపడతామని వారికి భరోసా ఇస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు శ్రీకావ్యను ఘనంగా సత్కరిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఓపిగ్గా వృద్ధులతో మాట్లాడి ధైర్యం చెప్పడం, వారితో మమేకం కావడం, వారి ఆప్యాయతానురాగాలను పొందడంలో శచీదేవితో శ్రీకావ్య పోటీపడుతుందంటూ స్థానికులు ప్రశంసించారు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించడంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం అర్బన్ హెల్త్ సెంటర్లలో అందుతున్న వైద్య సేవలను వివరిస్తూ ప్రతి దానికి ప్రైవేటు వైద్యం కోసం ఖర్చుచేయవద్దని తెలిపారు. ప్రభుత్వం మంచి వైద్యంతో పాటు మందులు కూడా అందిస్తోందని వివరించారు. కార్యక్రమంలో 43వ డివిజన్ కార్పొరేటర్ కండేస్వాతి రమణయాదవ్, 44వ డివిజన్ కార్పొరేటర్ గోపిరెడ్డి గోపాల్‌రెడ్డి, మహిళా విభాగం జిల్లా, నగర అధ్యక్షురాళ్లు తమ్మినేని మాధవి, చింతగుంట్ల సువర్ణ, కార్పొరేటర్లు తాడి కృష్ణలత, గోలి లక్ష్మీకోటేశ్వరమ్మ, ఏపీ టైలర్ల వెల్ఫేర్ బోర్డు రాష్ట్ర చైర్మన్ షేక్ సుభాన్‌బీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరెడ్డి అరుణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లీలాకుమారి, జిల్లా కార్యదర్శి బత్తుల మరియమ్మ, శ్రీదేవి, రావి రమణమ్మ, ప్రమీల, తూము పద్మ, అంజలి, మల్లీశ్వరి, నగర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షురాలు భాండావత్ మంజుల, మాజీ జిల్లా అధ్యక్షురాలు పోకల అనూరాధ, తోటపల్లి సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పూర్ణాహుతి



వైభవంగా పూర్ణాహుతి కార్యక్రమం

త్రిపురాంతకం: మహా శివరాత్రి మహోత్సవాల సందర్భంగా త్రిపురాంతకంలోని శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వర స్వామి వారి ఆలయంలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. రుద్రహోమం, బలిహరణ, పూర్ణాహుతి, వసంతోత్సవం, నాగవల్లి ప్రత్యేక పూజలు వేదపండితుల ఆధ్వర్యంలో చేశారు. అర్చకులు విశ్వనారాయణ శాస్త్రి, ప్రసాదశర్మ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల ఈఓ చెన్నకేశవరెడ్డి, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ఐవీ సుబ్బారావు ఉత్సవాలను పర్యవేక్షించారు. ట్రస్ట్‌బోర్డు సభ్యులు, భక్తజనులు ఈప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

పేదల అభివృద్ధే మా ధ్యేయం



పేదలకు తోపుడుబండ్లు అందిస్తున్న బాలినేని శచీదేవి, ప్రణీత్‌రెడ్డి, శ్రీకావ్య

- పేదలకు 30 తోపుడు బండ్లు అందజేసిన బాలినేని శచీదేవి, ప్రణీత్‌రెడ్డి, శ్రీకావ్య

ఒంగోలు: పేదల అభివృద్ధే తమ ధ్యేయమని వైఎస్సార్ సీపీ యువ నాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం స్థానిక తమ నివాసం వద్ద తల్లి శచీదేవి, భార్య శ్రీకావ్య, కుమారుడు సిద్ధాన్స్‌తో కలిసి పేదలకు 30 తోపుడు బండ్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల తన తల్లి, తన భార్య ఇద్దరూ మహిళలతో మమేకం–స్త్రీశక్తితో శచీదేవి కార్యక్రమంలో భాగంగా పలువురు పేదలు పడుతున్న వెతలను స్వయంగా గమనించారన్నారు. వారికి తమవంతుగా ఆర్థికాభివృద్ధికి ఉపయోగపడేలా ఉంటుందనే ఉద్దేశంతో 30 తోపుడు బండ్లు అందిస్తున్నామన్నారు. తమ కుటుంబం ఎల్లప్పుడూ ఆర్థిక సాయం అందిస్తూ పేద ప్రజల సంతోషంలో పాలుపంచుకుంటూనే ఉంటుందని, భవిష్యత్తులోనూ ఇది కొనసాగుతుందని అన్నారు. మరికొంతమందికి కూడా త్వరలోనే మరిన్ని తోపుడు బండ్లు అందిస్తామని తెలిపారు.

ఓటర్లకు అవగాహన కల్పించేందుకు పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, అధికారులు

ఒంగోలు అర్బన్: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేలా ఓటరుకు అవగాహన కల్పించేందుకు కలెక్టర్ దినేష్‌కుమార్ సోమవారం ప్రకాశంభవనంలో పోస్టర్ ఆవిష్కరించారు. జిల్లాలోని అన్ని బ్యాంకులు, పోస్టాఫీసులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో అవగాహన కల్పించేందుకు పోస్టర్లు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా, డీపీఓ నారాయణరెడ్డి, సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్, పంచాయతీరాజ్ ఎస్ఈ కొండయ్య, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు, స్వీప్ అధికారులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ అంజమ్మకృష్ణారెడ్డి

నాగులుప్పలపాడు: అభివృద్ధే అజెండాగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీపీ నలమలపు అంజమ్మకృష్ణారెడ్డి అన్నారు. మండల పరిషత్ నిధులతో ఉప్పుగుండూరు గ్రామంలో సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. మొదటిగా రూ.10 లక్షల నిధులతో ఎస్టీకాలనీలోని కమ్యూనిటీ భవనం ప్రహరీకి ఎంపీపీ చేతులమీదుగా శంకుస్థాపన చేశారు. అనంతరం 2వ వార్డులో రూ.6 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి పూజలు చేసి పనులు ప్రారంభించారు. దీర్ఘకాలికంగా యాదవ కులస్తుల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న నాగన్న వాగుపై బ్రిడ్జి పనులను ప్రారంభించారు. పార్టీలోని నాయకులంతా సమన్వయంగా ఉండి అభివృద్ధి కార్యక్రమాలను త్వరగా పూర్తి చేయాలని అంజమ్మ కృష్ణారెడ్డి కోరారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు మాదాసు రాంబాబు, సర్పంచ్ దేవరకొండ జయమ్మ, ఎంపీటీసీలు తాటి అనూరాధ, మున్నంగి వెంకటరావు, నాయకులు పోలినేని కోటేశ్వరరావు, మద్దిసాని నాగేశ్వరరావు, పాలపర్తి శ్రీను, ఇమ్మిశెట్టి బాలకృష్ణ, పేరాల చెన్నకేశవులు, కందుల దానియేలు, కొలకలూరి శాంసన్, వజ్రం బాబు తదితరులు పాల్గొన్నారు.

మడనూరు రామలింగేశ్వరస్వామి

ఆలయానికి చేరిన రథం



ఈతముక్కల గ్రామం నుంచి రథాన్ని సాగనంపుతున్న గ్రామ పెద్దలు

ఈతముక్కల (కొత్తపట్నం): ఈతముక్కల గ్రామం నుంచి మడనూరు శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయానికి సోమవారం రథోత్సవం సాగింది. ఆదివారం మడనూరు నుంచి ఈతముక్కల గ్రామానికి రథోత్సవం నిర్వహించారు. ఆనవాయితీ ప్రకారం ఆదివారం రాత్రి ఈతముక్కల గ్రామంలో నిద్ర చేయించి సోమవారం సాయంత్రం రథాన్ని మడనూరు గ్రామానికి తరలించారు. ఎండోమెంట్ ఈవో జి.రమణారెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు కేశవరపు ఆదినారాయణరెడ్డి, ఆళ్ల రవీంద్రరెడ్డి, కేశవరపు కోటిరెడ్డి, సర్పంచ్ మేడికొండ సునీత, తుమ్మ పుల్లయ్య, లింగారెడ్డి సంజీవరెడ్డి, లింగారెడ్డి వెంకారెడ్డి, పాక్లెయిన్ చక్రారెడ్డి, అడిగోపుల లక్ష్మీనారాయణ, బొమ్మిశెట్టి పాండురంగారావు, తదితర గ్రామ పెద్దలు ప్రత్యేక పూజలు చేశారు. రథం ఆవరణలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రామస్తులు రథం ముందు టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. బస్టాండ్ సెంటర్ నుంచి బ్యాంక్ బజారు, పంచాయతీ కార్యాలయం నుంచి మడనూరు శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయానికి రథం చేరింది. రథం చక్రాల మధ్యలో గుమ్మడికాయలు, టెంకాయలు పెట్టి మొక్కు చెల్లించుకున్నారు. నాలుగు రోడ్ల కూడలిలో భారీగా మందు చెట్లు పేల్చారు. మలుపుల దగ్గర అతి కష్టం మీద రథోత్సవం కొనసాగింది. సీఐ జగదీష్, ఎస్సై బి.సాంబయ్య సిబ్బందితో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని రథోత్సవాన్ని పర్యవేక్షించారు. భక్తులు ఈతముక్కల నుంచి మడనూరు వరకు బారులుదీరారు. మడనూరుకు చేరిన రథంలో రామలింగేశ్వరస్వామి, కన్నేశ్వరస్వామి, కోదండరామస్వామి, జ్వాలాముఖి ఉత్సవ విగ్రహాలు ఉండగా, కిందకు దించి ఆలయం చుట్టూ తిప్పారు.

జగన్ ప్రజల కోసం.. బాబు పొత్తుల కోసం..!

- వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి
- దర్శి 3, 4 వార్డుల్లో మన ఊరు మన శివన్న కార్యక్రమం
- అధిక సంఖ్యలో పాల్గొన్న ప్రజలు



మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: రాష్ట్రం బాగుండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తుంటే.. చంద్రబాబు పొత్తుల కోసం ఢిల్లీ వెళ్లి జాగారాలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి విమర్శించారు. స్థానిక ఎస్సీ కాలనీలోని 3, 4 వార్డుల్లో సోమవారం మన ఊరు మన శివన్న కార్యక్రమం నిర్వహించారు. హాజరైన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి, ఆయన సతీమణి నందిసీలకు దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటికి తిరిగి అందుతున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పేద, బడుగు, బలహీనవర్గాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేసిన వారిలో ఆనాడు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఒకరైతే.. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని స్పష్టం చేశారు. పేదల ఇళ్లలో వెలుగులు నింపాలని, పేదల పిల్లలు కూడా ఉన్నత చదువులు చదవాలని అమ్మవడి ద్వారా వారిని ఆర్థికంగా ఆదుకున్నారన్నారు. నాడు–నేడు ద్వారా పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దారన్నారు. పేదల పిల్లలు కూడా ఉన్నత చదువులు చదవాలని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం చదువులు ప్రవేశపెడితే.. వాటిని కూడా అడ్డుకునేందుకు చంద్రబాబు నీచ రాజకీయాలు చేస్తున్నారని చెప్పారు. తన మనవడు మాత్రమే ఇంగ్లిషు మీడియం చదవాలనేది చంద్రబాబు ఉద్దేశం అయితే.. తన పిల్లలతో పాటు పేదల పిల్లలు కూడా మంచి చదువులు చదవాలనేది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు జన్మభూమి కమిటీలు పెట్టి పేదల సొమ్ము దోచుకుతింటే.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థ తీసుకొచ్చి నేరుగా ఇంటికే పథకాలు అందిస్తున్నారని చెప్పారు. 2014లో అధికారంలోకి వచ్చి 100 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తానన్న చంద్రబాబు.. ఆ దిశగా అడుగులు కూడా వేయలేదన్నారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై ఉన్న గౌరవంతో 200 అడుగుల విగ్రహం ఏర్పాటు చేసి అంబేడ్కర్ ఆశయ సాధనలో పయనిస్తున్న గొప్ప వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ పేదలపై ప్రేమతో 30 లక్షలకుపైగా ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత దేశంలో ఒక్క జగన్‌దే అన్నారు. చంద్రబాబుకు పేదలంటే ఇష్టంలేదని చెప్పారు. సీఎం జగనే పేదలకు పెద్ద పీట వేశారని అన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి, ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, మాజీ ఉపసర్పంచ్ కొడవటి జాన్, వ్యవసాయ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారెడ్డి సుబ్బారెడ్డి, మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కట్టెకోట హరీష్, గర్నెపూడి సామ్యేల్, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు గర్నెపూడి స్టీవెన్, వైఎస్సార్ సీపీ సంయుక్త కార్యదర్శి సుశీలా ప్రతాప్, ఇత్తడి జయరావు, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెన్నపూస బాపిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.